సూర్యోదయ వార్త

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 34 | శుక్రవారం 30.10. 2026 | పేజీలు :4 | వెల: 2

పోలీసుల లాఠీలకు భయపడొద్దు..

నవంబర్ 1న ర్యాలీకి తరలిరండి.. ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు



హైదరాబాద్ సూర్యోదయ వార్త

నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు.

ఖర్గే నివాసంలో ఇండీ కూటమి నేతల మీటింగ్

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్ సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్ పార్లమెంట్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది.

ఆ 550 ఎకరాలు ప్రభుత్వానివే..



- మియాపూర్ భూముల కేసులో సుప్రీం తీర్పు
- తెలంగాణ ప్రభుత్వం విజయం
- ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేత
- ప్రభుత్వం చూపిన చొరవకు ప్రశంసలు

తెలంగాణకు

పెట్టుబడుల వెల్లువ

కేంద్ర సర్కార్ పూర్తి సహకారం

వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి తెలంగాణ కీలక భాగస్వామి





- రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని స్వాగతించిన పీయూష్ గోయల్
- 30 ట్రిలియన్ డాలర్లలో 10 శాతాన్ని తెలంగాణ కంట్రిబ్యూట్ : సీఎం రేవంత్
- జీసీసీ, ఏఐ, లైఫ్ సైన్సెస్‌లో హైదరాబాద్ ముందంజ
- ఆర్ఆర్ఆర్ నిర్మాణం హైదరాబాద్‌కు మరో గేమ్ ఛేంజర్
- డిసెంబర్ ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలకు శ్రీధర్‌బాబు ఆహ్వానం

వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని రంగాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 2047 నాటికి రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

హైదరాబాద్ సూర్యోదయ వార్త

పందుగల రోజుల్లో ఇన్వెస్ట్ తెలంగాణ సన్నాహక కార్యక్రమం నిర్వహించడం కూడా మరో పండుగ వాతావరణాన్ని తలపిస్తోందని గోయల్ అన్నారు. సుమారు 700 ఏళ్ల క్రితమే కాకతీయ గణపతి చక్రవర్తి మోటుపల్లి శాసనం ద్వారా నౌకా వాణిజ్యానికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. అప్పట్లోనే వ్యాపారులు పెట్టుబడులకు భద్రత, విధానాల్లో స్థిరత్వాన్ని కోరుకున్నారని, నేటి పారిశ్రామికవేత్తల ఆకాంక్షలు కూడా అవేనని చెప్పారు. భారత్ ప్రపంచంలోని తొలి ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిందని, అంచనాలకు మించి వేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని గోయల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ సంప్రదాయ అంచనాలను అధిగమించి ఎగుమతులను పెంచుతున్నామని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతి రాష్ట్రం తన సామర్థ్యాన్ని చాటాలని, ప్రతి పెట్టుబడి, ప్రతి ఉద్యోగం దేశ ప్రగతికి దోహదపడుతుందని అన్నారు.

హైదరాబాద్ సామర్థ్యంపై ప్రశంసలు

జీసీసీ, ఏఐ, లైఫ్ సైన్సెస్

నయా ఉస్మానియా పనుల వేగం పెంచండి

మంత్రి దామోదర రాజనర్సింహా

నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్, గోషామహల్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఈ రెండు కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిపై గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల కింద ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణ పనుల పురోగతి, తదుపరి చేపట్టాల్సిన పనులపై మంత్రి అధికారులతో చర్చించారు. గోషామహల్‌లో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని, నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ రెండు ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పనులు ముందుకు సాగేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరిస్తూ, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్యరంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని, కీలకమైన ఈ ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, ఎ పాల్గొన్నారు.

బాహుదా ఉగ్రరూపం..

హైవేపై వరద

- చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై రాకపోకలు బంద్
- రైల్వే ట్రాక్‌లపైకి వరదనీరు.. 9 రైళ్లు రద్దు, 14 దారి మళ్లింపు
- మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- జలదిగ్బంధంలో పలు గ్రామాలు



హైదరాబాద్ సూర్యోదయ వార్త

అరుణ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తిన వరదలతో శ్రీకాకుళం జిల్లా అతలాకుతలమైంది. ముఖ్యంగా బాహుదా నది ఉగ్రరూపం దాల్చడంతో ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనక రంగా మారింది. ఒడిశాలోని బగలతి డ్యామ్ నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో బాహుదాలోకి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. అధికారులు నదికి మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

హైవేపై వరద ఉద్ధృతి

బాహుదా వరద నీరు జాతీయ రహదారి-16పైకి చేరడంతో చెన్నై-కోల్‌కతా హైవేపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పలు గ్రామాలకు రహదారి సంబంధాలు తెగిపోయాయి. వరద ఉద్ధృతి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు.

రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

వరద ప్రభావం రైల్వే మార్గాలపైనా పడింది. సోంపేట మండలం తల్లాభద్ర వద్ద, కంచిలి మండలం జాదుపూడి



ములుగులో జలసిరిపై వర్క్ షాప్..

ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్. హేమంత్ బోర్కడే వాసుదేవరావు..

ములుగు. అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త..)

వీబీజి రామ్‌జి పథకంలో భాగంగా చేపట్టిన జల సిరి కార్యక్రమంపై గురువారం ఐ డి ఓ సిలో అధికారులకు వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ బోర్క డే హేమంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భూగర్భ జలాల పెంపునకు సోకు పి ట్ రీఛార్జ్ పీట్‌ల నిర్మాణాల ఆవశ్యకతపై వివరించారు. జిపిలలో నూతన ఆవిష్కరణలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నతా ధికారులు. ఎంపీడీవోలు . సెక్రెటరీ లు పాల్గొన్నారు..

నీటి వృథాను అరికట్టేందుకు 'పానీ' యాప్

- ప్రతి పౌరుడూ వాటర్ వారియర్ కావాలి
- ప్రతి కుటుంబం 20 శాతం నీటి వినియోగం తగ్గించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

2



పోలీసులకు, ప్రజలకు మధ్య సురక్ష వారధి కావాలి

- **తప్పుడు ప్రచారాలకు వాస్తవాలతోనే చెక్**



మారుతున్న సమాచార సాంకేతిక యుగంలో పోలీసు వ్యవస్థ చేసే త్యాగాలు, సమాజ రక్షణకు అందిస్తున్న నిస్వార్థ సేవలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత ఉందని తెలంగాణ డీజీపీ, సురక్ష దినపత్రిక ప్రధాన సంపాదకుడు సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత కారణాలతో లేదా దురుద్దేశపూర్వకంగా పోలీసులపై అసత్య కథనాలు, వక్రీకరణలు ప్రచారంలోకి వచ్చినప్పుడు.. వెనువెంటనే వాస్తవాలను సమాజం ముందుంచి ప్రజల్లో నమ్మకాన్ని కాపాడటంలో సురక్ష పత్రిక కీలక పాత్ర పోషించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక అధికారిక దినపత్రిక సురక్ష ప్రథమ వార్షికోత్సవ సమావేశం గురువారం హైదరాబాద్ పేట్లబురుజులోని సిటీ పోలీస్ కాలేజీలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఒకప్పుడు దినపత్రికల ద్వారా మాత్రమే ప్రజలకు వార్తలు చేరేవని, ఆ తర్వాత టెలివిజన్ రాకతో నిర్ణీత సమయాల్లో బులెటిన్లు వచ్చేవని గుర్తుచేశారు. కానీ నేడు స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా పుణ్యమాని ప్రపంచంలోని ఏ మూలన ఏం జరిగినా క్షణాల వ్యవధిలో ప్రజల అరచేతిలోకి వచ్చేస్తోందన్నారు. సమాచార ప్రసారం ఎంత వేగవంతమైందో, అందులోని నిజానిజాలను నిర్ధారించడం అంతకంటే పెద్ద సవాలుగా మారిందిన్నారు.కేసుల దర్యాప్తులో ఎదురయ్యే అనుభవాలు, కిడ్నాప్ కేసుల ఛేదన, నిరంతర పెట్రోలింగ్ విధానాలు, నేరాల బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కథనాలను ప్రచురించాలని సూచించారు. పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావాలంటే స్థానిక భాష, మాండలికాలపై పట్టు సాధించడం ఆవశ్యకమని డీజీపీ స్పష్టం చేశారు.ప్రజల భాష, వారి ప్రాంతీయ యాస తెలిసినప్పుడే బాధితుల సమస్యలను, వారి మనోభావాలను అధికారులు స్పష్టంగా అర్థం చేసుకోగలరని చెప్పారు.



కాంగ్రెస్ ప్రభుత్వానికే హాలిడే ఇవ్వాలి

- ఓ వైపు పంటలు ఎండిపోతుంటే.. మూసీ సుందరీకరణ ఎందుకు?
- డీపీఆర్ లేకుండానే లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

మల్లన్న సాగర్‌పై కొత్త కుట్రలు ఆపాలి: హరీశ్‌రావు

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాజెక్టుల భద్రతపై పట్టింపు ఉందా?అని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ప్రశ్నించారు. లక్షలాది మంది రైతుల కోసం, ఉత్తర తెలంగాణ దాహార్తిని తీర్చేందుకు రూ.కోట్లు వెచ్చించి కట్టుకున్న మల్లన్న సాగర్ రిజర్వాయర్ కట్ట పక్కనే నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా భారీ బ్లాస్టింగ్‌లు ఎలా చేస్తారని మండిపడ్డారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టను సందర్శించారు. అనంతరం తిప్పారం వద్ద పైప్‌లైన్ల కోసం నిర్మిస్తున్న ఇంటెక్‌వెల్‌ను హరీశ్‌రావు పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డను రాజకీయ ప్రయోజనాల కోసం దెబ్బతీసినట్లే, ఇప్పుడు మల్లన్న సాగర్ కట్టను కూడా బలహీనపరిచి ఈ ప్రాజెక్టును నాశనం చేయాలని చూస్తున్నారా? బ్లాస్టింగ్‌ల ధాటికి కట్టకు ప్రమాదం వాటిల్లితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. తాను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి చూశానని, కట్ట పక్కనే పెద్ద పెద్ద గోతులు తవ్వి, పేలుళ్లు జరుపుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇది నిర్లక్ష్యం కాదు, స్పష్టమైన కుట్ర అని ఆరోపించారు. వెంటనే అక్రమ బ్లాస్టింగ్ పనులను నిలిపివేయాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

రైతులకు వ్యవసాయ అధికారులు సూచన..



వెంకటాపూర్. ములుగు జిల్లా. అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ఆ ర్నా ట్ తుఫాన్ ప్రభావం వల్ల పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగిందని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం వరి గింజలు గట్టిపడే దశలో ఉన్నందున వరి కంకులు నీటి మునిగే అవకాశం ఉన్నందు వల్ల గింజలు మొలకెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. పొలంలో నీటిని వెల్లదీసి లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారి చేయాలన్నారు. దీంతో గింజలు మొలకెత్తకుండా ఉంటాయని అధికారులు సూచించారు.

108 వాహనంలోనే పురుడు పోసిన సిబ్బంది..

తల్లీబిడ్డ క్షేమం..



మంగపేట, ములుగు జిల్లా (అక్టోబర్29)(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేటమండలంలోని దోమెడ గ్రామానికి చెందిన కోరం నాగలక్ష్మికి గురువారం రోజు తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి.దీంతో అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు (ఈఎంటీ) ఎడ్ల నరేష్ అంబులెన్స్ లోనే పురుడు పోశారు. నాగలక్ష్మి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. సకాలంలో స్పందించి సురక్షితంగా కాన్పు చేసిన ఈఎంటీ ఎడ్ల నరేష్, పైలట్ మధుకుమార్ లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

కమలాపురంలో జట్టి సుమిత్ర కుటుంబాన్ని పరామర్శించిన బసారికారి హరికృష్ణ..



,మంగపేట, ములుగు జిల్లా. అక్టోబర్ 29.(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేటమండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మేడిపల్లి శశి అత్త జట్టి సుమిత్ర మృతి చెందిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు బసారికారి హరికృష్ణ గురువారం రోజున ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు. జట్టి సుమిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఆయన వెంట జిల్లా యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి యంపెల్లి వీరస్వామి, హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన డైరెక్టర్ బోడ బొరయ్య, ఎస్సీ విభాగం గ్రామ కమిటీ సభ్యుడు దాసరి బుజ్జి, మేడిపల్లి శేషి, వంకాయల భరత్ తదితరులు పాల్గొన్నారు..

రామన్నగూడెంలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం ..

- స్థానికులకు తీవ్ర ఇబ్బందులు..
- పట్టించుకోని అధికారులు..

ఏటూరు నాగారం. ములుగు జిల్లా. అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలో పారిశు ద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ముఖ్యంగా సమీపంలోని గోదావరి కరకట్ట వద్ద చెత్తను కుప్పగా వేయడంతో దుర్వాసన వెదజ ల్లుతుంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిపి అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

చెరుపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..
- మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.

శెట్టి పెల్లి వెంకటేశ్వర్లు.



మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని చెరుపల్లి గ్రామంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు.రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచే స్తోందని తెలిపారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ,ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కంకణబద్ధమై పనిచేస్తోందని అన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి,అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామ చంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యంపెల్లి వీరస్వామి,బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన డైరెక్టర్ బోడ బొరయ్య, నాయకులు లొంక రాజు,బరపాటి నర్సింహారావు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు జీపీఓ , డీలర్ తదితరులు పాల్గొన్నారు...

భారత దేశంలోని ఆదివాసుల వ్యక్తిగత మౌఖిక (ఓరల్ లా) విధానాలు..

సూర్యోదయ వార్త ప్రత్యేక కథనం..

ములుగు. అక్టోబర్ 29(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– భారతదేశంలోని ఆదివాసుల జనాభా సుమారు 10 కోట్ల మంది ఉన్నారు 705 పైగా తెగలు ఉన్నాయి. వీళ్లకు ప్రత్యేకమైన వ్యక్తిగత (పర్సనల్ లా) చట్టాలు లేవు ఆదివాసీ సమాజానికి సాధారణ ప్రజలకి కూడా తెలియదు అందరూ ఎక్కువగా హిందూ పర్సనల్ లా చట్టాలని ఆదివాసుల చట్టాలుగా అనుకుంటున్నారు. హిందువులకు ముస్లింలకు క్రైస్తవులకు పర్సనల్ లా చట్టాలు ఉన్నాయి. ఆదివాసులు కూడా ప్రత్యేక మతం కాలం ఉండేది 1871 నుండి 1951 వరకు గిరిజన రిలీజియన్ అనే కాలం ఉండేది 1961 సంవత్సరంలో పాలించిన ప్రభుత్వాలు తొలగించాయి. బౌద్ధం సిక్కు, జైన,క్రైస్తవ మతాల కంటే ఆదివాసుల జనాభా కంటే ఎక్కువగా ఉన్నారు. కాబట్టి ప్రభుత్వాలు ప్రత్యేక మతం కాలము ఇవ్వాలి ఆదివాసులకు మతం కాలము నేది లేకపోవడం వల్ల ఆదివాసీలు హిందూ మతం లేదా ఇతరులు అని రాస్తున్నారు. ఈ యొక్క పాలక ప్రభుత్వాలు ప్రత్యేక ఆదివాసి మతం కాలము ఇచ్చి గుర్తించాలి. మతం లేనందు వలన హిందూ మతం లేదా ఇతరులుగా రాస్తున్నారు. దీనివలన ఆదివాసులకు ఒక మతం అంటూ గుర్తింపు లేదు. కానీ ఆదివాసుల సంస్కృతి ఆచార, సంప్రదాయాల వలన వారి యొక్క ప్రకృతి ఆరాధన పంచభూతాలు(గాలి నీరు ఆకాశం నిప్పు భూమి) వారి యొక్క పూర్వీకుల ఆత్మలను ఇలవేల్పు (దేవుడు) గా పూజిస్తారు. వాటిని ఆధారంగా చేసుకుని మౌఖిక చట్టాలు వచ్చాయి. మౌఖిక చట్టం అంటే నోటి మాటల ద్వారా పూర్వకాలం నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాల ద్వారా వస్తున్న చట్టాలు అలిఖిత పూర్వకంగా ఉంటాయి. వీటినే వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లా)అంటారు.?

ఆదివాసి వివాహక చట్టం (ఓరల్ లా).

హిందూ వివాహ చట్టం 1955 ముస్లిం వివాహ చట్టం 1937 క్రైస్తవుల వివాహ చట్టం 1872 ఉన్నాయి. అలాగే ఆదివాసులు కూడా అలిఖి తమైన మౌఖిక చట్టాలు ఉన్నాయి.ఆదివాసి సమాజంలోని పెళ్లి చేసే ముందు అమ్మాయికి అబ్బాయికి పెళ్లి వయస్సు వచ్చిన తర్వాత ముందుగ.

వరుసలు కలిసిన తర్వాతే పెళ్లి చేస్తారు.

వరుస అంటే అర్థం గట్టు/ గోత్రాలు ఓకే విధంగా ఉంటే పెళ్లి చేయరు. ఆదివాసుల్లో గట్టు గోత్రాలు ఉంటాయి ఈ గోత్రాలు మూడు నుంచి ఏడు వరకు ఉంటాయి ఒకటే గోత్రం/గట్టు వాళ్లు పెళ్లి చేసుకోరు ఎందుకంటే వాళ్లు రక్తసంబంధం కలిగిన వారు అయి ఉంటారు కాబట్టి వేరే గోత్రం/ గట్టు వాళ్ళని పెళ్లి చేసుకుంటారు. ఈ పద్ధతి హిందూ సమాజంలో కూడా ఉంది. ఎక్కువగా ఒకే తెగకు సంబంధించిన వాళ్లలోనే పెళ్లిళ్లు చేసుకుంటారు ఉదాహరణకు కోయ తెగ వారు వారి తెగలోనే పెళ్లి చేసుకుంటారు. ఇతర తెగలతో కానీ వేరే కులాలతో గాని పెళ్లి సంబంధాలు చేసుకోవడం నిషేధం గా ఉంటాయి. హిందువులకు క్రిస్టియన్స్ కి ఏకపత్ని విధానం ఉంటది. కానీ ఆదివాసి తెగల్లో చాలా తెగలలో బహుభార్యత్వం ఉంటుంది కొన్ని తెగల్లో ఏకపత్ని విధానం పాటిస్తున్నారు. అది తెగల ఆచారా సంప్రదాయాలను బట్టి ఉంటుంది.

- విడాకులు..!

ఆదివాసి సమాజంలో భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేకమైన కోర్టు ఉండవు. హిందువులకు క్రైస్తవులకు ముస్లింలకు ప్రత్యేకమైన పర్సనల్ లా చట్టాలు ఉంటాయి. ఆదివాసుల ఆచార సాంప్రదాయాల్లోనే పద్ధతుల ద్వారా అలాగే పెద్దల తెగల సమక్షంలోనే వివాదాల్ని పరిష్కరిస్తారు.విడాకులు అయిన తర్వాత భార్యకు హిందూ మతంలో అయితే నెల నెల భరణం ఇవ్వాలి కానీ ఆదివాసీ ఆచార సంప్రదాయాలలో అలా ఇవ్వరు ఒకేసారి భూమి గానీ ఆవులను గాని డబ్బు గానీ ఇస్తారు. అది కూడా పిల్లలు తన దగ్గర ఉంటే ఇస్తారు. ఆదివాసుల సాంప్రదాయ ఆచారాల ద్వారా పరిష్కారం అవుతాయని తెలవక చాలామంది ఆదివాసులు సాధారణ కోర్టుకు వెళ తున్నారు. ఒకవేళ హిందూ సాంప్రదాయం ప్రకారం ఆదివాసులు పెళ్లి చేసుకుంటే కోర్టుకు వెళ్ళవచ్చు

భరణం (మెయింటెనెన్స్)..

ఆదివాసి సమాజంలో పిల్లల బాధ్యత తండ్రి తీసుకుంటాడు ఎక. – ఎక్కువగా నెల నెల భరణం అనేది ఉండదు భార్య కూడా నెల నెల భరణం అనేది ఉండదు ఒకేసారి ఇస్తారు అలాగే వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత కూడా కొడుకే తీసుకుంటాడు. ఈ యొక్క బాధ్యత ఆదివాసుల ఆచార సంప్రదాయాల ద్వారా పెద్దల సమక్షంలో నిర్ణయిస్తారు..

ఆదివాసి దత్తత మౌఖిక చట్టం.

హిందువులకు దత్తత చట్టం 1956 ఉందిఆదివాసి సంప్రదాయాల ప్రకారం సొంత గోత్రం/ గట్టు వాళ్ళ పిల్లలను దత్తత తీసుకుంటారు ఎక్కువగా సొంత అన్నదమ్ముల పిల్లల్ని తీసుకుంటారు ఎందుకంటే ఆస్తి రక్తసంబంధికులకే చెందాలన్న ఆలోచనతో అలాగే శుభం ఆ శుభ కార్యక్రమాలకు రక్తసంబంధం వారే కార్యక్రమాలు చేయటం వల్ల ప్రయోజనం ఉంటుందని నమ్ముతారు..

ఆదివాసి వారసత్వ మౌఖిక చట్టం.

హిందూ వారసత్వం చట్ట ప్రకారం కుమారుడికి కూతురికి సమాన హక్కులు ఉంటాయి. ఆదివాసి వారసత్వ మౌఖిక చట్టాల ప్రకారం ఆదివాసులు పితృ సామ్య వ్యవస్థ అమల్లో ఉంది కనుక కుమారులకే ఆస్తి పైన అధికారం ఉంటుంది కూతుర్లకు ఆస్తి పైన హక్కు ఉండదు ప్రత్యేక చట్టాలు లేవు కనుక కానీ కొన్ని ఆదివాసి తెగలలో కూతుర్లకు కూడా తన తండ్రిలో వాటాలో భూములలో గాని ఆస్తిని గాని ఇస్తున్నారు చాలామంది ఆదివాసి మహిళలు కోర్టులకు వెళుతున్నారు చట్టాలు లేకపోవడం వలన వాళ్ళకి ఆస్తి హక్కులో వాటా రావటం లేదు కానీ న్యాయమూర్తులు మానవత్వం సమానత్వం మరియు మంచి విచక్షణతో ఆలోచించి సహజ నాయన సూత్రాల ఆధారంగా తీర్పులిస్తున్నారు ఉదాహరణ రామ్ చరణ్ వర్సెస్సు సు ఖీరామ్ 2025 సుప్రీంకోర్టు కేసు దైయా అనే గోండు మహిళ కు అనుకూలంగా తీర్పు వచ్చింది. అలాగే కులాంతర వివాహం చేసుకున్నా మహిళలకు స్థిర ఆస్తులు భూమి లాంటివి ఇవ్వటం కుదరదు ఎందుకని అంటే స్థిర ఆస్తులకు, ఎల్ టి ఆర్ 1 /70 చట్టానికి అలాగే ఫారెస్ట్ యా క్ట్ 2006 చట్టాలకు సమస్యలకు కారణాలు అవుతాయి కాబట్టి నిషేధం.

ఆదివాసి మైనార్టీ మరియు సంరక్షణ మౌఖిక చట్టం

18 సంవత్సరాల లోపు పిల్లలకు హిందూ మైనార్టీ మరియు సంరక్షణ చట్టం 1956 ఉంది అలాగే ఆదివాసులకి ఆదివాసి ఆచార సంప్రదాయాల ప్రకారం 18 సంవత్సరాల లోపు పిల్లల బాధ్యతను ఎక్కువగా తండ్రి వైపు బంధువులే చూసుకుంటారు. అలాగే వారి యొక్క కుటుంబ సభ్యులందరూ చూసుకుంటారు..

ముఖ్యంగా ఆదివాసీలు వాళ్ళ యొక్క ఆచార సంప్రదాయాలు సంస్కృతుల ద్వారానే రాజ్యాంగ చట్టాలు హక్కులు రక్షించబడతాయి ఎప్పుడైతే ఆచార సంప్రదాయాలు సంస్కృతులు మరిచిపోతారో. అప్పుడే చట్టాలను ఈ యొక్క పాలక ప్రభుత్వాలు తొలగిస్తాయి ఎందుకంటే ఆదివాసుల చట్టాలు ఆచార సంప్రదాయాల మీదనే ఆధారపడి ఉన్నాయి వ్యక్తిగత (పర్సనల్ లా)చట్టాలు పూర్తిగా అలిఖిత రూపంలో ఉన్నాయి. కాబట్టి ఆచార సంప్రదాయాలు ప్రస్తుతం కూడా పాటిస్తున్నారు అని కోర్టులకు సమాజానికి ప్రభుత్వాలకు తెలిస్తేనే సాక్ష్య ఆధారంగా నిరూపించబడతాయి. లేదంటే చట్టాలు రద్దు చేయడానికి అవకాశాలు ఉంటాయి అని ఆయన వివరించారు.



- చింత సమ్మయ్య
అడ్వకేట్ ఎం . ఏ , ఎల్. ఎల్ .ఎం,
హెచ్ పి టి..

గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తాం..

- వెంకటాపూర్‌లో రూ.99 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల ప్రారంభం..
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి - దనసరి అనసూయ సీతక్క



వెంకటాపూర్. ములుగు జిల్లా . అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని విధాలా కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ శ్రీనివాస్‌తోపాటు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వెంకటాపూర్ మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. సీఆర్ఆర్ (ప్లెయిన్) 2025--26 నిధులతో రూ.54 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, సీఆర్ఆర్ (ఎస్‌సీపీ) 2024--25 నిధులతో రూ.45 లక్షల అంచనా వ్యయంతో సీసీ డ్రెయిన్ల పనులు చేపట్టారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గతంలో కాలనీలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్, నాయకుల సూచనలు, సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.ఆశించిన మేర వర్షాలు కురవని నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, ప్రతి కుటుంబం నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు.గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు...



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండ..

- షారుఖాన్ కుటుంబానికి 25కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేత..
- గ్రామ కమిటీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్.



మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 29:(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని పొదుమూరులో గురువారం నిరుపేద కుటుంబానికి చెందిన ఖాజా ఖాన్--భానుబి దంపతుల కుమారుడు షారుఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో,విషయం తెలుసుకున్న మంగపేట గ్రామ కమిటీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.షారుఖాన్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ 25 కిలోల బియ్యంతో పాటు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ,కష్టకాలంలో నిరుపేద కుటుంబాలను ఆదుకోవడం,బాధితులకు అండగా నిలవడం కాంగ్రెస్ పార్టీ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ,ప్రజలకు అవసరమైన సమయంలో మానవతా దృక్పథంతో సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ పరామర్శలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, సీనియర్ నాయకులు తోట తిరుపతి, చాద శేఖర్, గగ్గురి మహేష్ మరియు పాల్గొన్నారు..

భీమ్ మీడియా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా - అల్లి ప్రశాంత్..



వాజేడు. ములుగు జిల్లా అక్టోబర్ 29(సూర్యోదయ వార్త.)

– ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో భీమ్ మీడియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు వాజేడు భీమ్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా అల్లి ప్రశాంత్ కుమార్ తెలంగాణ వార్త తెలుగు దినపత్రిక ఎన్నికయ్యారు, ఉపాధ్యక్షుడిగా అరకిల్ల సమ్మయ్య విశాల భారతి, సెక్రెటరీ(సర్వేశ్వరరావు మన తొలివెలుగు, జాయింట్ సెక్రటరీగా (అగ్గి శేఖర్ పెన్ గన్, సీకే న్యూస్ రహీం, నిత్య నిఘ కార్తీక్, ఎన్నికయ్యారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు పత్రికేయులు శుభాకాంక్షలు తెలిపారు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలబడడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు నిష్పక్షపాత వార్తలతో ప్రజల విశ్వాసాన్ని జర్నలిస్టుల ఐక్యతను కాపాడాలని సూచించారు అల్లి ప్రశాంత్ నాయకత్వంలో భీమ్ మీడియా అసోసియేషన్ బలోపేతమై పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు..

ఫోర్జరీ.. కార్యదర్శి సేవలు రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశం..

వాజేడు. ములుగు జిల్లా. అక్టోబర్ 29 సూర్యోదయ వార్త ప్రతినిధి.



ములుగు జిల్లా వాజేడు మండలం ధర్మవరం గ్రామపంచాయతీలో సర్పంచ్ సంతకాల ఫోర్జరీ చేశారన్న ఫిర్యాదు పై ములుగు జిల్లా కలెక్టర్. బోర్క దే హేమంత్ సహదేవరావు చర్యలకు ఆదేశించారు. గ్రామసభ. పంచాయతీ తీర్మానం. రిజిస్టర్లలో తమకు తెలియకుండా సంతకాలు చేశారని సర్పంచ్ సుమతి ఫిర్యాదు చేశారు. విచారణలో విధి నిర్వహణలో నిబంధనలు పాటించలేదని నివేదిక రావడంతో అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శి ఇరుప ప్రసాద్ సేవలను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏజెన్సీ ని ఆదేశించారు..

డీజిల్ ధరల పెరుగుదలకు అనుగుణంగా వాహనాల బిల్లులు పెంచాలి..

వాహన యజమానులు. డ్రైవర్ల ఆర్థిక భారాన్ని తగ్గించాలని వినతి..



ములుగు. అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త . ప్రతినిధి)

పెరుగుతున్న డీజిల్ ధరలకు అనుగుణంగా వాహనాల బిల్లులను పెంచాలని కోరుతూ భూపాలపల్లి. ములుగు జిల్లాల డ్రైవర్లు కం ఓనర్లు సూపర్ టెండింగ్ ఇంజనీర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇంధన ధరలు పెరగడంతో వాహనాల నిర్వహణ ఖర్చులు అధికమై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని యూనియన్ సభ్యులు తెలిపారు. ప్రస్తుత ధరలకు అనుకూలంగా వాహనాల బిల్లులను సవరించి పెంచితే డ్రైవర్లు. వాహన యజమానులకు కొంత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. తమ సమస్యలను అధికారులు పరిశీలించి. బిల్లుల పెంపునకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీకి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు..



తాడ్వాయి. ములుగు జిల్లా. అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

సర్ కు వ్యతిరేకంగా ఢిల్లీ రామ్ లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జాతీయస్థాయి ప్రో టెస్ట్ కు ములుగు జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలి వెళ్తున్నారు. తాడ్వాయి మండలానికి చెందిన నాయకులు మేడారం వనదేవతల ఆశీర్వాదం తీసుకొని ప్రత్యేక బస్సులో బయలుదేరారు . వీరిలో ఆరెం లచ్చు పటేల్ . పిఏపీఎస్ చైర్మన్ బొల్లు దేవేందర్. పులి సంపత్. సతీష్. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు. రవికుమార్. తండాల శ్రీను తదితరులు పాల్గొన్నారు..

తాడ్వాయిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశం..

తాడ్వాయి. ములుగు జిల్లా. అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా తాడ్వాయి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి --, జనగామ మాజీ ఎమ్మెల్యే, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ములుగు ఇంచార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిలి హాజర య్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకులతో సమావేశమై, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని సూచించారుఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ



లను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించ డంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా



పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాకులమారి ప్రదీప్ , ఎట్టి జగదీష్ తాడ్వాయి మండల సర్పంచులు ప్రవళిక గున్ను, దిడ్డి మోహన్ రావు, జాజ విజయ చంద్రం, జిల్లా సీనియర్ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు 100 ఓట్ల ఇంచార్జీలు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

మంగపేట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ చేసిన ఏటూరునాగారం ఏఎస్పీ.- మనన్ భట్

మంగపేట. ములుగు జిల్లా . అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త.)

వార్షిక తనిఖీలో భాగంగా ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ మంగపేట పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, వాటిపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రెగ్యులర్ గా డ్రంక్ అండ్ డ్రైవ్, వెహికల్ చెకింగ్ నిరంతరం చేయాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ల బాధ్యత కీలకమని, కేటాయించిన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గంజాయిపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాల్లోకి ఎవరు తీసుకొస్తున్నారో గుర్తించి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల



నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబరుస్తూ, ప్రజలకు సేవలందిస్తూ నేరాల నియంత్రణలో ప్రతిభ చూపిన సిబ్బందిని



అభినందించారు. ఆయన వెంట ఏటూరునాగారం సీఐ, మంగపేట ఎస్ఐలు టీవీఆర్ సూరి, శ్రీకాంత్ ఉన్నారు...

ఏటూరునాగారం, తాడ్వాయి ఎంఆర్సీలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ

- విద్యార్థులకు 21 రకాల వస్తువులు 100 శాతం అందాలి!
- పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

ములుగు, అక్టోబర్ 29:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అవసర వస్తువుల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి విద్యార్థికి పూర్తి స్థాయిలో సదుపాయాలు అందించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ములుగు జిల్లా ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని మండల వనరుల కేంద్రాలను (ఎంఆర్సీ) సందర్శించి, విద్యార్థులకు పంపిణీ చేస్తున్న వస్తువుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాం వస్త్రాలు, ఐడీ కార్డులు, బెల్టులు, బ్లాక్ షూస్, వైట్ షూస్, సాక్సులు, ట్రాక్ షూస్, స్కూల్ బ్యాగులు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ బాక్సులు, దుప్పట్లు, నైట్ డ్రెస్‌లు



తదితర 21 రకాల వస్తువుల పంపిణీ వివరాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు కేటాయించిన వస్తువులు వాస్తవంగా అందాయా లేదా అనే విషయాన్ని రికార్డులతో సరిపోల్చి ధృవీకరించాలని సూచించారు. పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, ప్రతి విద్యార్థికి నిర్దేశించిన అన్ని వస్తువులు అందేలా పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ విద్యార్థికి కూడా వస్తువుల పంపిణీలో అన్యాయం జరగకుండా, 100 శాతం పంపిణీ పూర్తయ్యేలా సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరాలను



దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు వారికి పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. పంపిణీ వివరాల్లో తేడాలు లేకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం మండల విద్యాశాఖ అధికారి మల్లయ్య, తాడ్వాయి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు..

గ్రామాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులకు వినతి పత్రాలు అందజేత..

- జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు.
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ.
- వివిధ శాఖల అధికారులతో సమావేశం..
- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు..

- ఏటూరు నాగారం. అక్టోబర్ 29 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వివిధ శాఖల అధికారులను కలిసి





వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులకు వివరించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సత్వరమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని చిటమట రఘు తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు స్పందించాలని కోరారు.వినతి పత్రాలపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత సమస్యలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నా



రామప్పలో అలరించిన పేరిణి నృత్యం..

వెంకటాపూర్. ములుగు జిల్లా . అక్టోబర్ 29

(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలో నీ రామప్ప ఆలయంలో పేరిణి నృత్యం ప్రదర్శించారు. కాకతీయుల శిల్పకళ సంపదను వివరించే ఈ నృత్యం కళ పై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. అనంతరం నితిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవిందరాజు. రోల్ ఆఫ్ టూరిజం ప్రమోషన్ ఇన్ లైట్ ఆఫ్ రామప్ప ఇన్ స్కబ్ అంశంపై వివరించారు...

రైతులకు మెరుగైన సేవలు అందించాలి..



వెంకటాపూర్. అక్టోబర్ 29. ములుగు జిల్లా. (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ మన్ననులు పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి . సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ పిఏసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకరోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన చెన్నోజు శ్రీనివాస్ కు సూచించారు. ఈ సందర్భంగా పాలక వర్గాన్ని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

త్రాగునీటి సమస్యకు అంతరాయం కలగొద్దు..

ములుగు మున్సిపాలిటీ కమిషనర్. సంపత్ రెడ్డి.

ములుగు. అక్టోబర్ 29. సూర్యోదయ వార్త.

– ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బండారుపల్లి రోడ్డులో జరుగుతున్న పైపులైన్ మరమ్మత్ పనులను మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి సరఫరా లో అంతరాయం కలగకుండా మరమ్మత్తులను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...



శబరిమల నేపథ్యంలో డివోషనల్ థ్రిల్లర్..
‘హరివరాసనం’ ఫస్ట్ లుక్ విడుదల!

మలయాళ నటుడు సాయిజు కురుప్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘హరివరాసనం’ నుంచి మేకర్స్ తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 15న మకర సంక్రాంతి సందర్భంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమలలో వేలాది మంది భక్తుల నడుమ హీరో సాయిజు కురుప్, చిన్నారి బేబీ ఈవాతో కలిసి స్వామి సన్నిధిలో ప్రార్థన చేస్తున్నట్లుగా ఈ పోస్టర్ ఉంది. కేవలం భక్తి మార్గానికి మాత్రమే పరిమితం కాకుండా, ఒక తండ్రి – కూతుళ్ల భావోద్వేగ ప్రయాణం నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రముఖ దర్శకుడు రాజేష్ నాయర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సాయిజు కురుప్‌తో పాటు కోలీవుడ్ ప్రముఖ నటుడు యోగి బాబు, సితార విజయన్, సంపత్ రాజ్, జాయ్ మాథ్యూ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

నక్సలైట్ నాయకుడిగా ఆర్. నారాయణమూర్తి..
యూట్యూబ్‌లో దూసుకుపోతున్న ‘హుషారు 2’ టీజర్




టాలీవుడ్‌లో ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సంచలన విజయం సాధించిన చిత్రం ‘హుషారు’ (2018). సున్నితమైన హాస్యం, స్నేహం మరియు యువతను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా ఇప్పుడు ‘హుషారు 2’ వస్తోంది. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ యూట్యూబ్‌లో దూసుకుపోతోంది. మొదటి భాగాన్ని మించిన వినోదం, డబుల్ మ్యాడ్నెస్ మరియు ఊహించని యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. చిత్రగుంజ్ నేపథ్యంలో కథ.. ‘బాయ్స్ ఆర్ బ్యాక్’ అనే క్యాప్షన్‌తో మొదలయ్యే ఈ టీజర్‌లో, రాహుల్ రామకృష్ణ తన గ్యాంగ్‌తో కలిసి ఒక క్రేజీ ఐడియాను నిజం చేసుకోవడం కోసం ‘చిత్రగుంజ్’ ప్రాంతానికి వెళ్లడం చూపించారు. అడవి నేపథ్యంలో సాగే ఈ ప్రయాణంలో విలన్ల నుంచి తప్పించుకునే క్రమంలో కథ ఎన్నో ఆసక్తికర మలుపులు తిరుగుతుంది. ఈ టీజర్‌లో అందరికంటే ప్రధాన ఆకర్షణ, హైలైట్ పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి ఎంట్రీ. సాధారణంగా కమర్షియల్ చిత్రాలకు, ప్రత్యేక పాత్రలకు దూరంగా ఉండే ఆయన.. ఈ యూత్‌ఫుల్ సినిమాలో సాయుధ నక్సలైట్ నాయకుడిగా కనిపించి అందరినీ విపరీతంగా ఆశ్చర్యపరిచారు. టీజర్ చివరిలో ఆయన చెప్పే “తమ్ముళ్లూ వేట మొదలెడదామా!” అనే పవర్‌ఫుల్ డైలాగ్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మొదటి భాగంలో ‘కబూమ్’ బీర్ తయారీ చుట్టూ సరదా సన్నివేశాలు నడిస్తే, ఈ సీక్వెల్‌లో ‘టేకిలా’ బిజినెస్ మరియు అడవి నేపథ్యంలో సాగే యాక్షన్, కామెడీ ఎపిసోడ్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. రాహుల్ రామకృష్ణ తనదైన శైలి సెటైర్లు, కామెడీ టైమింగ్‌తో టీజర్‌ను మరింత నవ్వులు పూయించేలా మార్చారు. ఈ చిత్రంలో రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి ఆంటోనీ, దినేష్ తేజ్, శశిధర్ కొచర్లకోట, విధి యాదవ్, అభిజ్ఞ ఉతులూరు తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మొదటి చిత్రాన్ని విజయవంతంగా తెరకెక్కించిన శ్రీహర్ష కొనుగంటి ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు.

‘రామాయణ’ చూసి ఆశ్చర్యపోయా..

‘లార్డ్ ఆఫ్ ది రింగ్స్’తో పోల్చిన హాలీవుడ్ విమర్శకుడు!



భారతీయ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్’పై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమా ప్రపంచ ప్రీమియర్ లాస్ ఏంజెలెస్‌లో బుధవారం ఉదయం భారత కాలమానం ప్రకారం జరిగింది. చిత్ర బృందంతో పాటు పలువురు అంతర్జాతీయ సినీ విమర్శకులు ఈ ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. సినిమా ఇంగ్లిష్ వెర్షన్‌ను వీక్షించిన ఓ విమర్శకుడు చేసిన పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2001లో విడుదలైన ‘ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్’ సినిమా చూసినప్పుడు కలిగిన అద్భుతమైన అనుభూతి, ఇప్పుడు ‘రామాయణ’ చిత్రాన్ని చూసినప్పుడు మరోసారి కలిగిందని ఆ అంతర్జాతీయ విమర్శకుడు పేర్కొన్నారు. ఈ కామెంట్స్ సినిమా తనపై ఎంతటి ప్రభావం చూపిందో తెలియజేస్తోంది. ముఖ్యంగా భగవాన్ శ్రీరాముడి పాత్రను తెరపై ఆవిష్కరించిన తీరును ఆయన ప్రశంసించారు. అయితే, ప్రస్తుతం సినిమా పూర్తి సమీక్షలను ప్రచురించడంపై ఆంక్షలు ఉండటంతో కథ, నటీనటుల ప్రదర్శన, సాంకేతిక అంశాలపై ఆయన పెద్దగా స్పందించలేదు. రివ్యూలపై ఆంక్షలు తొలగిన తర్వాతే తన పూర్తి అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. ‘రామాయణ’ తొలి భాగం ముగింపు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసేలా ఉంటుందని కూడా ఆ విమర్శకుడి స్పందన ద్వారా తెలుస్తోంది. సినిమా చివర్లో తెర నల్లగా మారినప్పుడు తాను ఆశ్చర్యంతో గట్టిగా అరిచానని ఆయన పేర్కొన్నారు. ఈ ముగింపు రెండో భాగంపై ఆసక్తిని మరింత పెంచేలా ఉంటుందని అంచనా వేస్తున్నారు. తన పూర్తి సమీక్షను ఆదివారం ప్రచురిస్తానని, అప్పటికి సమీక్షలపై ఉన్న ఆంక్షలు తొలగుతాయని ఆయన తెలిపారు. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న రామాయణ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీత పాత్రలో, యశ్ రావణుడి పాత్రలో నటిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. సన్నీ డియోల్, రవి దూబే, అరుణ్ గోవిల్, లారా దత్తా, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, యశ్ కూడా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు.



‘రామాయణ’ ఇంగ్లిష్ వెర్షన్‌లో 25 నిమిషాలు కట్

ప్రపంచ ప్రీమియర్‌లో ఆసక్తికర విషయం!

భారతీయ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్’ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ సినిమా ప్రపంచ ప్రీమియర్ అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరిగింది. అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లోని డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. చిత్ర ప్రధాన బృందం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంది. అయితే, ప్రదర్శించిన ఇంగ్లిష్ వెర్షన్ నిడివిపై ఇప్పుడు ఆసక్తికర చర్చ జరుగుతోంది. లాస్ ఏంజెల్స్‌లో ప్రదర్శించిన ఈ సినిమా ఇంగ్లిష్‌లోకి అనువదించిన త్రీడీ వెర్షన్ అని సమాచారం. ఈ వెర్షన్‌ను చూసిన పలువురు ప్రేక్షకులు, అసలు హిందీ వెర్షన్‌తో పోలిస్తే నిడివి తక్కువగా ఉందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. హిందీ వెర్షన్ మూడు గంటలకు పైగా ఉంటుండగా, ఇంగ్లిష్ వెర్షన్‌లో సుమారు 25 నిమిషాల నిడివి తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ మార్పునకు అసలు కారణం ఏమిటన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఇంగ్లిష్ వెర్షన్‌లో కొన్ని పాటలను తొలగించి ఉండవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పాటల నిడివి తగ్గించడం వల్లే సినిమా మొత్తం నిడివిలో వ్యత్యాసం వచ్చి ఉండవచ్చని కొందరు భావిస్తున్నారు. కానీ చిత్ర బృందం నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా, యశ్ నిర్మిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం చేసేలా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీతాన్ని అందిస్తున్నారు. భారతీయ సంగీత ప్రతిభతో పాటు అంతర్జాతీయ స్థాయి సంగీత దర్శకుడి భాగస్వామ్యం కూడా ఈ ప్రాజెక్టుపై అంచనాలను పెంచుతోంది. ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్’ తొలి భాగాన్ని 2026 నవంబర్ 5న విడుదల చేయడానికి చిత్ర బృందం సిద్ధమవుతోంది. ప్రపంచ ప్రీమియర్ పూర్తవడంతో సినిమా గురించి మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా హిందీ, ఇంగ్లిష్ వెర్షన్ల నిడివిలో తేడా ఎందుకు వచ్చిందనే అంశంపై చిత్ర బృందం స్పష్టత ఇస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.